సామెతకథలు

## ఉడుమును చంకలో పెట్టుకొని ఊళ్ళో ప్రవేశించినట్లు

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

రాజులు రాజ్యాలు ఏలేనాటి కాలంలో వారివారి రాజ్యాలు పెంపు చేసుకోడానికై ఎదిరి రాజ్యాలపై దండయాత్రలు చేస్తూండేవారు. ఎదిరి బలం ఎక్కువని తోస్తే, వారిని తేలికగా స్వాధీనపరచుకోవడం కోసం మార్గాంతరాలు అన్వేషిస్తూండేవారు. అందులో ఒక భాగమైనదే ఉడుము.

ఉడుమునకు గట్టి పట్టు పట్టే శక్తి ఉంది. తరువాత చెప్పుకోతగినది భల్లూకపు పట్టు. వీటికివే సాటి. ఆ పట్టు విడిపించాలంటే ఏనుగులు పెనుగులాడినా లాభం లేదు. ఎంతటి నున్నపైన గోడైనా అతి వేగంగా పైకెగపాకి పోతుంది. కావుననే ఉడుములా ఎక్కాడంటారు. ఆపై నాలుగు కాళ్ళు చాచి పట్టుపట్టిందంటే విడిపించడం బ్రహ్మకు కూడా తరమా? ఈ నగ్న సత్యాన్ని గ్రహించిన రాజులు ఉడుముకు ప్రత్యేక శిక్షణనిచ్చే బోయలను సిబ్బందిగా నియోగించి సాకేవారు. వారి శిక్షణలో తయారైన ఉడుము తోకకు పగ్గం బిగించి గోడకు విసరేవారు. పగ్గం బిగిసేవరకు పైకెగప్రాకి పట్టు బట్టేది. ఆ పగ్గం పట్టి సైనికులెగపాకటం, కోటలోనికి జొరబడడము జరిగేది.

ఈ విధంగా రాజులకడ ఉద్యోగిగా గాక కోయంబత్తూరు జిల్లాలో ఉడుముల పేట అనే తాలూకా నందు ఏడెనిమిది మైళ్ళ దూరమునందొక గ్రామము కలదు. దీన్ని పాళేగారు రాజధానిగా చేసుకొని ఉడుములు పెంచుతుండేవారు. వారు మైసూరు రాజులకు ఉడుములు సరఫరా చేసేవారట. ఆ విధంగా ఊళ్ళు, కోటలు కొల్లగొట్టడానికి ఉడుము పెత్తనం చేసేది. అది కాలక్రమములో దొంగలు దోచుకోడానికి కూడా దోహదకారి యైనది. ఏది ఎట్లున్నా దొంగలైతేనేమి? దొరలైతేనేమి ఆ రోజుల్లో ఉడుమును చంక బెట్టందే ఊళ్ళో ప్రవేశించేవారు కాదు. *

**ఉడుముపట్టు!**

తమ మాట నెగ్గేవిధముగా ప్రవర్తించేవారిని, సంకల్పించిన కార్యమును సాధించడానికి ఎంతటి శ్రమనైనా అధిగమించేవారిని 'అతనిది ఉడుముపట్టు' అనడం మనము విన్నదే. అయితే ఇది అతిశయమా! నేటి రాజకీయనాయకులు తమకు లభించిన పదవి ఎట్టి పరిస్థితిలోనూ వదులుకోడానికి ఇష్టపడరు. కుర్చీకి అతుక్కుపోయి, తమ కుర్చీని ఎవరైనా ఆక్రమిస్తారేమోనని అతి జాగ్రత్తతో వ్యవహరిస్తారు. వీరి పట్టు ఉడుము పట్టుకన్నా ప్రశస్తమైనదేమోనని అనుమానము కలగడం సహజం. మరి మీరే తేల్చుకోండి!